# షాక్

■ చోడిశెట్టి శ్రీనివాసరావు

ఎన్నికలొచ్చేశాయ్!

అంతవరకూ అధికారంలో ఉన్న ప్రభుత్వం వల్ల తమకు జరిగిందేమిటో, ఒరిగిందేమిటో జనానికి తెలియకుండానే ఎన్నికలొచ్చేశాయ్!

సామాన్యుడి బతుకు భారం మరింత పెరిగేలా చేసి మళ్ళీ ఎన్నికలొచ్చేశాయ్!!

అధికార పార్టీతో సహా అన్ని పార్టీలవారూ తమ ప్రచారాన్ని హోరుగాలిలా జోరుగా సాగిస్తున్నారు.

ఆ సందర్భంగా ఓ 'ఎ' క్లాసు సిటీలో ఏర్పాటు చేసిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో మాజీ మంత్రి, ఆశాజ్యోతి పార్టీ అధ్యక్షులు ఆశయాలరావు గారు అధికార పార్టీవారి అవకతవకలను విమర్శిస్తూ, మళ్ళీ తమ పార్టీ అధికారంలోకొస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఏకధాటిగా ముప్పావు గంట సేపు మాట్లాడి అలసిపోయి అప్పుడే తమ ఉపన్యాసం ముగించారు.

ఆ మహాసభలో ఉన్న అసంఖ్యాక జనం ఆశయాలరావు ఆశాజనకమైన ఉపన్యాసానికి ముగ్ధులై ఆనంద పారవశ్యంతో అర నిమిషం పాటు అలాగే ఉండిపోయి, ఆ వెంటనే తమ కర్తవ్యం గుర్తుకొచ్చి దిక్కులు పిక్కటిల్లేలా, అధికార పార్టీవాళ్ళు హడలిపోయేలా, ఇతర పార్టీలవాళ్ళు ఈర్ష్యతో కుమిలిపోయేలా చప్పట్లు కొట్టసాగారు.

జనంలో కలిగిన స్పందన చూసి ఆశయాలరావు గారి ముఖం కోటి సూర్యుల కాంతితో వెలిగిపోయింది. ఆయన తన కంచుకంఠం విప్పి మరేవేవో వాగ్దాన వరాలు జనానికి ప్రసాదించాలని ఉవ్విళ్ళూరుతుండగా, ఆయనకు అత్యంత సన్నిహితులు, పార్టీ కార్యదర్శి అయిన మారుతీరావుగారు చటుక్కున తమ కుర్చీలోంచి లేచి, రెండే రెండు అంగల్లో ఆశయాలరావును సమీపించి, "సోదరా! ఆమె చూడ్డం లేదు. మాట్లాడ్డం లేదు. నాకేదో అనుమానంగా ఉంది" అన్నారు ఆయనకు మాత్రమే వినిపించేలా.

అప్పుడు తత్తరపడుతూ తల పక్కకి తిప్పి చూశారు ఆశయాలరావుగారు. ఆయన సతీమణి హారతీదేవి మెడ వెనక్కి వాల్చేసి కుర్చీకి జారబడి పోయున్నారు. గుండె గుభేలుమనగా గబాల్న ఆమె వద్దకెళ్ళి, చిన్నగా కదిలిస్తూ, "హారతీ... హారతీ" అని ఆత్రంగా పిలిచారు.

ఆమె ఉలకలేదు, పలకలేదు.

ఆశయాలరావుగారికి మతిపోయినంత పనైంది. ఆందోళన ఆయన అణువణువునూ ఆక్రమించుకుంది.

ఆయన గాబరా పడ్డం చూసి మారుతీరావుగారు హారతీ దేవి చెయ్యి పట్టుకొని నాడి పరిశీలించారు. రాజకీయాల్లోకి రాకపూర్వం ఆయన ఆయుర్వేద వైద్యం చేస్తుండేవారు. ఆమె గుండె అతి బలహీనంగా కొట్టుకుంటున్నట్టు ఇట్టే పసిగట్టి ఆస్పత్రికి తీసుకెళ్ళడం అత్యవసరమని ఆశయాల రావుగారికి తెలియజేశారు.

తక్షణం అందుకు కావాల్సిన ఏర్పాట్లు జరిగిపోయినాయి.

ఇంతలో సభలో అలజడి చెలరేగింది. అది గమనించిన మారుతీరావుగారు అనుకోకుండా ఆశయాలరావుగారి సతీమణి అస్వస్థతకు గురయ్యారని జనవాహినికి విన్నవించి, మహాసభను యథాప్రకారం కొనసాగించవలసిందిగా పార్టీ ఉపాధ్యక్షునికీ, కార్యకర్తలకూ విజ్ఞప్తి చేసి ఆశయాలరావుగారిని అనుసరించారు.

* * *

ఆ నగరంలో కెల్లా అతి పెద్దదీ, అత్యంత ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకున్నటువంటిదీ అయిన ఓ ఆస్పత్రిలో, కడు సమర్థురాలైన డాక్టర్ సావిత్రి పర్యవేక్షణలో హారతీదేవికి స్పృహ తెప్పించే ప్రయత్నం జరుగుతోంది.

సుమారు గంటవుతున్నా ఆమె పరిస్థితిలో మార్పు రాలేదు.

విజిటర్స్ లాంజ్‌లో ఆశయాల రావుగారు, మారుతీరావుగారు కూచొని ఉన్నారు. ఆశయాలరావుగారి మనసు మనసులో లేదు. ఆయన వదనం వాడిపోయిన పువ్వులా చిన్నబోయి ఉంది.

ఆయన పరిస్థితి చూసి మారుతీ రావుగారు, "కంగారు పడకండి సోదరా! కాస్సేపట్లో ఆమె కోలుకోవచ్చు. చిత్రమేమిటంటే, ఆమె మీ ఉపన్యాసాన్ని అత్యంత ఆసక్తితో వినడం అనేకసార్లు నేను గమనించాను. మరి ఎప్పుడు, ఎందుకలా స్పృహ కోల్పోయారన్నది మహా మాయగా ఉంది. ఒకవేళ జనం మీ పట్ల, మీ నాయకత్వం పట్ల చూపుతున్న అభిమానానికి ఆనందంతో ఉక్కిరిబిక్కిరవడం వల్ల అలా జరిగిందేమో. అసలే స్త్రీ మనసు చాలా సున్నితమైంది కదా! వాళ్ళు ఆనందాన్నీ పట్టలేరు, బాధనూ తట్టుకోలేరు. అనవసరంగా మీరేదో ఊహించుకుంటూ అధైర్యపడిపోకండి" అంటూ ఆశయాల రావు గారిని ఊరడించారు.

అయినా ఆశయాలరావుగారికి ధైర్యం సరిపోవడం లేదు. ఆయన ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగెడుతున్నాయ్.

ఎంత సేపూ ఇంటిపని, వంటపని చూసుకోవడం తప్ప హారతీదేవికి రాజకీయాల పట్ల ఎలాంటి ఆసక్తీ లేదు. తాను మంత్రిగా రాజ్య చక్రం తిప్పుతున్నప్పుడు కూడా గడప దాటి బయటికొచ్చి ఏ సభలోనూ పాల్గొనలేదు.

సభలూ, సమావేశాల గొడవ తనకి అక్కరలేదని చెబుతున్నా వినకుండా, స్త్రీలు అన్ని రంగాలలోనూ ముందంజ వేస్తున్నారనీ, ఒకటికి రెండుసార్లు సభల్లో పాల్గొంటే రాజకీయాల గురించి తెలుసుకునే అవకాశం ఉంటుందనీ నచ్చజెప్పి తానే హారతీదేవిని




బహిరంగ సభలో మాజీ మంత్రి, ఆశాజ్యోతి పార్టీ అధ్యక్షులు ఆశయాలరావు అధికార పార్టీని విమర్శిస్తూ, మళ్ళీ తమ పార్టీ అధికారంలోకొస్తే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఏకధాటిగా ముప్పావు గంట సేపు ప్రసంగించారు.

ఆరోజు ఆ మహాసభకు తీసుకొచ్చాడు. రాకరాక వచ్చిన ఆమెకేమైందో?

ఆమెకేమైనా అయితే తాను భరించడం కష్టం. ఆమె తన అదృష్ట దేవత. హారతీదేవి అడుగు పెట్టాకనే తన జీవితం ఇప్పుడు అఖండజ్యోతిలా వెలిగి పోతోంది.

ఆశయాలరావుగారి ఆలోచనలు అలా అలా సాగుతున్నాయి.

ఇంతలో హారతీదేవికి చికిత్స చేస్తున్న డాక్టర్ సావిత్రి అక్కడికొచ్చి, చింతాక్రాంతులై సర్వమూ కోల్పోయినట్టున్న ఆశయాలరావుగారిని చూసి చిన్నగా నవ్వి, "మీరు ఆందోళన పడాల్సిన పనిలేదు. ఆమె ఇప్పుడే స్పృహలోకొచ్చారు" అన్నారు.

పోతున్న ప్రాణం తిరిగి వచ్చినట్టయింది ఆశయాలరావుగారికి. ఆయన ముఖం మొగలి పువ్వులా విచ్చుకొంది. ఆమెకు థాంక్స్ చెప్పి, "ఎందుకిలా జరిగింది డాక్టర్" అన్నారు.

"కారణం ఫలానా అని స్పష్టంగా చెప్పలేను కానీ, మీ శ్రీమతిగారు తట్టుకోలేని ఆవేశానికో, బాధకో లోనై స్పృహ తప్పారు. ఆల్‌రైట్! ఇప్పుడేం భయం లేదు. ఆమెను చూడొచ్చు. ఎక్కువగా మాత్రం మాట్లాడించకండి. నేను పావుగంటలో వచ్చి మళ్ళీ చూస్తాను" అని చెప్పి తన రూమ్‌లోకి నడిచారు డాక్టర్ సావిత్రి.

మారుతీరావుగారు వెంటరాగా ఆశయాలరావుగారు హారతీదేవి ఉన్న రూమ్‌లోకి అడుగు పెట్టారు.

కళ్ళు మూసుకొని పడుకొని ఉన్న ఆమె వారి పద సవ్వడితో కన్నులు తెరచి ఎదురుగా కనిపించిన భర్తను చూస్తూనే మొహం చిట్లించుకున్నారు.

"నీకిప్పుడెలా ఉంది పార్వతీ?" ప్రేమగా అడిగారు ఆశయాలరావుగారు.

ఆయన అడిగిన దానికి సమాధానం చెప్పకుండా, "మన బాబులిద్దరినీ తక్షణం రప్పించండి" అని సీరియస్‌గా చెప్పి తిరిగి కళ్ళు మూసుకున్నారు హారతీదేవి.

ఒకటి రెండుసార్లు మాట్లాడించడానికి ప్రయత్నించినా ఆమె పెదవి విప్పలేదు, కన్నులు తెరవలేదు.

ఆమె ఎందుకలా ఉన్నదీ, పిల్లల్ని ఎందుకు రప్పించమన్నదీ ఆశయాలరావుగారికి అర్థం కాలేదు. ఆయన మనసులో ఏదో అనుమానం పొడసూపగా బరువెక్కిన హృదయంతో మారుతీరావుగారితో పాటు ఆ గదిలోంచి బయటికొచ్చి, ఆస్పత్రి నుంచే మద్రాసులో ఉన్న పెద్దవాడు ప్రకాష్‌కీ, గుంటూరులో ఉన్న చిన్నవాడు చిన్నారావుకీ వెంటనే రమ్మని ఫోన్ చేశారు.

ఆయన తిరిగి హారతీదేవి గదిలో కొచ్చేసరికి ఆమెను పరీక్షిస్తున్న డాక్టర్ సావిత్రి, "మీ శ్రీమతిగారిని ఇంటికి తీసుకెళ్ళిపోవచ్చు రావుగారూ" అన్నారు ఆయన్ని చూస్తూనే.

"తీసుకెళ్ళిపొమ్మంటారా?" అనుమానంగా అన్నారు ఆశయాలరావుగారు.

"నో డౌట్! ఆమె పూర్తిగా కోలుకున్నారు. నిరభ్యంతరంగా తీసుకెళ్ళవచ్చు" అన్నారు డాక్టర్.

"సరే, నేనా ఏర్పాటు చూస్తాను" అని మారుతీ రావుగారు అక్కడ నుంచి కదిలారు.

ఇంతలో ఆశాజ్యోతి పార్టీ కార్యకర్తలూ, ఆశయాల రావుగారి కుడి ఎడమ భుజాల్లాంటివాళ్ళిద్దరూ అక్కడికొచ్చారు.

మహాసభ జయప్రదంగా జరుగుతోందనీ, ఇతర నగరాల మాదిరిగానే ఇక్కడ సేకరించిన జనాభిప్రాయం ప్రకారం జరగబోవు ఎన్నికల జాతరలో విజయలక్ష్మి కచ్చితంగా తమ పార్టీనే వరిస్తుందనీ ఆశయాలరావుగారికి తెలియజేశారు. అనంతరం హారతీదేవి ఆరోగ్యం కుదుటపడిన విషయం మహాసభకు తెలియజేయడానికి వెంటనే అక్కడ నుంచి వెళ్ళిపోయారు.





**పార్టీ చేసిన వాగ్దానాల గురించి హారతీదేవి మాటలు పూర్తి కాకుండానే తండ్రీ కొడుకులు పకపకా నవ్వారు. పడీ పడీ నవ్వారు. పొట్టలు చేతబట్టుకొని మరీ నవ్వసాగారు.**

ఓ అరగంటలో హారతీదేవిని ఇంటికి చేర్చి, పూర్తిగా విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చి, ఆశయాలరావుగారి వద్ద సెలవు తీసుకుని మహాసభకు బయలుదేరారు మారుతీరావుగారు.

* * *

మరుసటి రోజు మధ్యాహ్నం హారతీదేవి అల్పాహారం మాత్రం తీసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఆ వేళ మరోచోట జరిగే సభలో పాల్గొనవలసి ఉన్నప్పటికీ, కుమారుల రాకకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు ఆశయాలరావుగారు.

ఇక పది నిమిషాల్లో రెండవుతుందనగా ప్రకాష్, చిన్నారావులిరువురూ ఒకేసారి వచ్చారు.

అమ్మ క్షేమంగా ఉన్నట్టు ఆస్పత్రిలోనే తెలిసి సంతోషించామని తండ్రికి చెప్పి, అసలేమైందని అడిగారు. జరిగినదంతా విపులంగా వారికి వివరించారు ఆశయాలరావుగారు.

తమ ఊహ తెలిశాక ఏరోజూ తలనొప్పి అని కూడా అనని తల్లి ఏకంగా స్పృహ తప్పిపోవడం చాలా ఆశ్చర్యమనిపించింది వాళ్ళకి.

భోజనాలు పూర్తి కాగానే ఇద్దరు కుమారులతో హారతీదేవి గదిలోకొచ్చి ఆమెను నిద్ర లేపారు ఆశయాల రావుగారు.

ఆమె కళ్ళు విప్పి లేచి కూచొని, "మీకు శ్రమ కలిగించినట్టున్నానురా! కోడళ్ళూ, పిల్లలూ కుశలమేనా" అన్నారు ఎదురుగా కనిపించిన కొడుకులిద్దరినీ చూస్తూ.

"వాళ్ళకేం, నిక్షేపంలా ఉన్నారు. అదిసరే, మీకు పూర్తి స్వస్థత చిక్కినట్టేనా?" అడిగాడు ఆప్యాయంగా పెద్ద కుమారుడు ప్రకాష్.

"ఎప్పుడూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండే మీరు నాన్నగారితో సభకు వెళ్ళి స్పృహ తప్పడం మాకెంతో విచిత్రంగా ఉందమ్మా! అలా ఎందుకు జరిగిందో చెప్పగలరా" అన్నాడు చిన్న కుమారుడు చిన్నారావు.

"అదే నాకూ అంతుబట్టకుండా ఉంది హారతీ! కళ్ళెదురుగా కనిపించిన మహా జనాన్ని చూసి కళ్ళు తిరిగినవా లేక నా ఉపన్యాసానికి ముగ్ధులై ఆ జనం కొట్టిన చప్పట్ల మోతకు నీ మనసు తట్టుకోలేక పోయినదా చెప్పు హారతీ. అసలు కారణమేమిటో

చెప్పు" అన్నారు ఆశయాలరావుగారు.

నిశ్శబ్దంగా కొన్ని క్షణాలు కదిలిపోయినై...

హారతీదేవి ఏం చెబుతారోనని ముగ్గురూ ఉత్సుకతతో ఎదురు చూస్తున్నారు.

"ఒరే అబ్బాయిలూ! ఇప్పటికి మన ఆస్తుల మొత్తం విలువ ఎంతుంటుందో మీలో ఎవరైనా చెప్పగలరా?" ఉన్నట్టుండి అడిగారు హారతీదేవి.

తండ్రీ కొడుకులు ముఖముఖాలు చూసుకున్నారు. హారతీదేవి ఎందుకలా అడిగారో వారికి తెలీలేదు. ఆమెకు మతి సరిగ్గా ఉందా లేదా అన్న అనుమానం కూడా వారి మనసుల్లో పొడసూపింది.

"మీ ఆరోగ్యం బాగుండని ఈ సమయంలో ఆ గొడవ ఎందుకమ్మా? తర్వాత మాట్లాడుకోవచ్చులెండి" అన్నాడు ప్రకాష్.

"తర్వాత కాదు. నాకిప్పుడే చెప్పితీరాలి." పట్టుదలగా అన్నారు హారతీదేవి.

"ఇప్పటికిప్పుడు చెప్పమంటే ఎలా చెప్పగలమమ్మా! మీ ప్రశ్నకు కచ్చితమైన జవాబు చెప్పాలంటే చాలా సమయం పడుతుంది. ఏదో ఉజ్జాయింపుగా చెప్పాలంటే, మనకు బ్యాంకుల్లో ఉన్న డబ్బు, పంట భూములు, వివిధ నగరాల్లో ఉన్న ఫైవ్‌స్టార్ హోటళ్ళూ, షాపింగ్ కాంప్లెక్సూ, గెస్ట్ హౌస్‌లు, సినిమా హాళ్ళు, ఫ్యాక్టరీలు, ఫ్యాక్టరీలలో షేర్లూ... ఇంకా ఇతరత్రా ఎక్కడెక్కడో ఉన్నదంతా లెక్కలు వేసుకుంటూ పోతే కొన్ని వందల కోట్లే ఉంటుంది. అయినా ఇప్పుడెందుకొచ్చిందమ్మా ఈ సందేహం మీకు" అన్నాడు చిన్నారావు.

"ఒరే అబ్బాయిలూ, మీరు తక్షణం మేలుకోకపోతే ఈ కోట్లన్నీ కరిగి మనం పడరాని పాట్లు పడే రోజులు రాబోతున్నాయిరా" అన్నారు విచార వదనంతో హారతీదేవి.

"మీరు మాట్లాడేదేమిటో నాకేమాత్రం అర్థం కావడం లేదమ్మా" అన్నాడు చిన్నారావు.

"మన ప్రజాస్వామ్యంలో కోట్లకు కోట్లు సంపాదించుకోవచ్చునే గానీ, సంపాదించినవి కరిగిపోవడమన్నది జరగని పనమ్మా! అసలు మీకిలాంటి భయం ఎందుకు కలిగిందో దయచేసి చెప్పండి" అన్నాడు ప్రకాష్.

"ఇది భయం కాదురా, రేపు జరగబోయే భయంకరమైన నిజం! ఈసారి ఆశాజ్యోతి పార్టీ అధికారంలోకొస్తే తమ సర్వశక్తులూ ఉపయోగించి, తమ సర్వస్వం ధారపోసి, వికటాట్టహాసం చేస్తూ విజృంభిస్తోన్న పేదరికాన్ని నిర్మూలిస్తామని నిన్న జరిగిన మహసభలో మీ నాన్నగారు వాగ్దానం చేసేశారురా..."

హారతీదేవి మాటలు పూర్తి కాకుండానే తండ్రీ కొడుకులు పకపకా నవ్వారు. పడీ పడీ నవ్వారు. పొట్టలు చేతబట్టుకొని మరీ నవ్వసాగారు.

"ఎందుకా నవ్వు?" కోపంగా అన్నారు హారతీదేవి.

ఆశయాలరావుగారు నవ్వాపి, "నువ్వెందుకు స్పృహ తప్పావో ఇప్పుడు అర్థమైంది హారతీ! నా సహధర్మచారిణివైన నువ్వు ఇంత అమాయకురాలివని నేను కలలో కూడా అనుకోలేదు సుమా" అంటూ గాఢంగా నిట్టూర్చారు.

"ఇంతా చేస్తే నాన్నగారు వేసిన జోక్‌కి మీరు షాక్ తిన్నారన్నమాట" అన్నాడు చిన్నారావు.

"జోక్!... జోక్..." ఆశ్చర్యంతో అన్నారు హారతీదేవి.

"ఔనమ్మా. అది కచ్చితంగా జోక్! ఎన్నికలు వచ్చినప్పుడల్లా నాయకులు వోటర్లకు ఎరవేసే జోక్! యాభై సంవత్సరాలు దాటిపోయినా ఇంకా నిత్యనూతనంగా విరాజిల్లుతున్న అతి గొప్ప జోక్!! కదు నాన్నగారూ" అన్నాడు ప్రకాష్.

మందహాసం చేస్తూ అవునని తలూపారు ఆశయాలరావుగారు. ■

# మానవీయతకు దివిటీలు

## *మానవ సంబంధాలలో ఘర్షణను పట్టిచ్చిన ఉత్తమ కథలు*

■**మల్లంపల్లి ధూర్జటి**



కథా మహల్
సంచాలకుడు: 'రచన' శాయి
ప్రతులకు: వాహిని బుక్ ట్రస్ట్,1-9-286/3, హైదరాబాద్-44.
వెల: రూ. 116/-

దువ్వూరి శారదాంబ స్మారక కథల పోటీలో బహుమతి పొందిన కథలతోపాటు ఆ పోటీకి వచ్చిన వాటిలో మరికొన్ని మంచి కథలను ఎంపిక చేసి *కథా మహల్* పేరిట ఈ సంకలనం తెచ్చారు. ఇందులో మొత్తం 33 కథలున్నాయి. కొందరు సమకాలీన అంశాలను ఇతివృత్తంగా తీసుకుంటే, మరికొందరు మానవ సంబంధాల మధ్య ఎప్పుడూ ఉండే ఘర్షణలను తమ కథలలో చిత్రించారు.

దాట్ల నారాయణమూర్తి రాజు కథ *మానవదహనం* సంతానం అంతా దూర ప్రాంతాలలో ఉంటే వృద్ధ తల్లితండ్రుల గతేం కాను? అని ప్రశ్నిస్తుంది. నేటి బాలలే రేపటి వృద్ధులు. వృద్ధాప్యాన్ని ఎవరం తప్పించుకోలేం. అందుకే మన వృద్ధుల్ని గౌరవిద్దాం, ప్రేమిద్దాం అని డాక్టర్ ఎమ్. సుగుణరావు *జీవితం* కథలో ప్రబోధిస్తారు. పిల్లల పెంపకంలో ఎదురయ్యే సమస్యలను, వాటిని ఎదుర్కోవలసిన మార్గాలను సూచించిన కథలు కూడా ఇందులో చోటుచేసుకున్నాయి. ఎమ్. హేమలత *అమ్మకు అభినందనలు* కథ ఆటిజమ్ రుగ్మతను చర్చించి, అటువంటి పిల్లల తల్లితండ్రులకు ధైర్యం చెబుతుంది. వసుంధర *పుత్రోత్సాహం* కథ ఎదుటివారి పిల్లల్లోని ప్రతిభా పాటవాలను అభినందించి, ప్రోత్సహించే మంచి అలవాటుకు మనల్ని పురికొల్పుతుంది. విద్యా వ్యవస్థా, సమాజమూ నేటి బాలురనీ రేపటి యంత్రాలుగా ఎలా మారుస్తున్నాయో ఇచ్ఛాపురపు రామచంద్రం *ఇంటికొక హంతకుడు* కథలో బాగా వివరించారు. స్పాస్టిక్ చైల్డ్ పెంపకంలో సమస్యలను వివరిస్తూనే మన దేశమే అటువంటి స్థితిలో ఉన్న వైనాన్ని ఎం.ఎస్. ప్రకాశరావు *కంచికి వెళ్ళని కథ*లో వివరించారు.

> **"అర్హతకు తగని గౌరవం లభించిన వాడు పార్టీ ఇస్తాడు. అది అతడి సంతోషం. అర్హతకి తగిన గౌరవం లభించిన వాడిని సన్మానిస్తారు." (పుట 221)**

సొంతానికి పాటుపడడంలో గొప్పేముంది? పరులకు సహాయపడడంలోనే తృప్తి ఉంది. జె. కిరణ్మయి కథ *తమసోమా జ్యోతిర్గమయ*లో కథానాయకుడు చివరలో ఈ సత్యాన్ని గ్రహిస్తాడు. ఆదూరి వెంకట సీతారామమూర్తి *అన్నమ్మ* కథలో ఇదే అంశాన్ని మరో కోణం నుంచి వివరించారు. "భూమి అట్టడుగు పొరల కింద పారే జల లాంటి మంచితనమేదో, ఉపకార స్వభావమేదో మనిషి అంతరంగంలోనూ ఉండాలి. ఆ తడి లేనప్పుడు మోడు వారిన చెట్టుకీ ఎండిన బీడు భూమికీ, మనిషి బతుక్కీ తేడా ఉండదేమో" అన్న రచయిత మాటలతో ఏకీభవించకుండా ఉండలేం. తోటి మనుషులతో కష్టసుఖాలను పంచుకోవడానికి ప్రయత్నించినప్పుడే మానవ సమాజం వర్ధిల్లుతుంది. మంచి మానవ సంబంధాలకు మచ్చుతునకగా అరుణ నిష్కల రాసిన *ఆసరా* కథను చెప్పుకోవచ్చు. ఇలా చేసే ఉపకారం ఏదీ ఉత్తినే పోదని పొత్తూరి విజయలక్ష్మి కథ *గురుదక్షిణ* చదివితే తెలుస్తుంది. తటవర్తి రామచంద్రరావు *మనిసికి మనిసి* కథలో అపకారికి కూడా ఉపకారం చెయ్యాలని ప్రబోధించారు. నిస్సంతులు అనాథలను పెంచుకోవడాన్ని ప్రోత్సహించే శ్రీసుభా కథ *అనాథపుష్పం*లో మంచి ట్విస్ట్ ఉంది.

స్త్రీ పురుష సంబంధాలలో వస్తున్న మార్పులకు అద్దం పట్టిన కథలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి. తమిరిశ జానకి *సమీర* కథలో భర్త శాడిజాన్ని, పురుషాహంకారాన్ని ఎదిరించిన ఇల్లాలిని చూడవచ్చు. సమస్యని ఎదుర్కోవడంలో, ఒడిదుడుకులను తట్టుకుని నిలబడడంలో పురుషులకన్నా మహిళలే మిన్న అనిపిస్తారు. అందుకే, శారద *చీకట్లోంచి వెలుతురులోకి* అన్న తన కథలో "ఎందుకు మగవాడు బాధ్యతకీ, కష్టపడడానికి జంకుతాడు?" అని ప్రశ్నించారు. మగవాడు వ్యసనానికి బానిసైనప్పుడే జీవితంలో ఓడిపోయానన్న సంగతిని గ్రహించుకోవాలని ఆమె చెప్పిన మాటలను చెవికెక్కించుకోవలసిన వారు మన సమాజంలో చాలా మందే ఉన్నారు. సర్కస్‌లో అరకొర దుస్తులు ధరించి పాల్గొనే అమ్మాయిలను చూసి చొల్లు కార్చే మానవ బలహీనతను అవధానుల విజయలక్ష్మి తన *ఫోర్త్ డైమెన్షన్* కథలో ఎండగట్టారు.

పగ తీర్చుకోవడానికి ఆడవాళ్ళే దొరుకుతారా? ఒక జాతిమీద, ఒక కుటుంబం మీద పగ తీర్చుకోవడమంటే వాళ్ళ ఆడవాళ్ళ శీలం హరించడమని అర్థమా అని ప్రశ్నించే ఎమ్బీయస్ ప్రసాద్ కథ *సమరంలో సమిధలు* ఆలోచింపజేస్తుంది. ఒక బస్సు ఆత్మ ఘోషను సయ్యద్ సలీం *చేతులుంటే ఎంత బావుణ్ణు* కథలో అద్భుతంగా వర్ణించారు. ఆత్మస్థయిర్యం, గుండెదిటత్వం కలిగి తన సిద్ధాంతాలమీద తనకు చెక్కుచెదరని నమ్మకం ఉన్నవాడే సంపన్నుడు అన్నారు పి.ఎస్. నారాయణ *సంపన్నుడు* కథలో. నిరాహార దీక్షల పూర్వరంగాన్ని, అందుకు కార్మికులు పడే వేదనను, మథనను వెల్చేరు చంద్రశేఖర్ కథ *దీ వూండ్* చక్కగా పట్టిచ్చింది. జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి కథ *తక్కాళి* అత్యాశ కూడదని చెబుతుంది. కానీ, ఇది కథలోని రైతుకు అన్వయించడం న్యాయమా అనిపిస్తుంది. కాశీభట్ల వేణుగోపాల్ *రాళ్ళెత్తిన కూలీ* కథ మెదడుకు మేత పెడుతుంది. సంపత్‌కుమార్ *రించిన్* కథ మేఘాలయ వెళ్ళి వచ్చిన అనుభూతిని కలిగిస్తుంది.

కథాభిమానులు భద్రపరచుకోతగ్గ పుస్తకాన్ని అందించిన శారదాంబ భర్త డాక్టర్ డి.ఎ.ఎ.ఎస్. నారాయణ రావు, సంచాలకుడు 'రచన' శాయి అభినందనీయులు. ■